# రామకృష్ణ మృతికి కారణమైన వారిని శిక్షించాలి

- బీఆర్ఎస్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు



రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వెంకట్రాములు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 11 : మల్దకల్ మండలకేంద్రానికి చెందిన రామకృష్ణ మృతికి కారణం అయిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు పోలీస్ అధికారులను కోరారు. రామకృష్ణ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం దవాఖానకు వెళ్లి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గత కొంత కాలంగా హిజ్రాల అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ప్రధాన రహదారుల్లో తిరగాలంటే ఇబ్బందికరంగా ఉందన్నారు. అలాగే జిల్లాలో ఏ ఇంట్లో ఏ కార్యం జరిగిన తక్షణమే వాలిపోయి డబ్బుల వసూల కోసం తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అలాగే ఈ మధ్యనే ఓ హిజ్రా వేధింపుల కారణంగా జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు మృతి చెందిన విషయం మరవక ముందే మళ్లీ ఘటన చోటు చేసుకోవడం విషాదకరమన్నారు. పోలీస్ అధికారులు స్పందించాలని, హిజ్రాలపై చర్యలు తీసుకునే విధంగా చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

# భూసేకరణ పనులు వేగవంతంగా చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 11 : ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు పూర్తిచేసేందుకు మిగిలిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భూసేకరణ, భూ నిర్వాసితుల పునరావాస ఏర్పాట్లపై ఇరిగేషన్, రెవిన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బుద్దారం పెద్దచెరువు, గణపసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించిన భూసేకరణపై ప్రధానంగా చర్చించారు. బుద్దారం పెద్దచెరువుకు 11.57ఎకరాల భూమికి వారంరోజుల్లో అవార్డ్ పాస్‌చేయాలని అనంతరం వెంటనే ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. చెరువు లోపల అవసరమైన 205 ఎకరాల స్థలానికి సంబంధించి 109 ఎకరాలకు త్వరలో అవార్డ్ పాస్ చేయాలని మిగిలిన 96 ఎకరాలకు సర్వే చేయించాలని ఆర్డీవోను ఆదేశించారు. సర్వే అనంతరం గ్రామసభ ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. గణప సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి సర్వే పూర్తి అయిన 18ఎకరాలకు, మరో 399 ఎకరాల స్థలానికి అవార్డ్ పాస్ చేయాలని , ఇరిగేషన్ శాఖ తరపున వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. మిగిలిన 197 ఎకరాలకు సర్వే చేయించాల్సిందిగా సూచించారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటు వేగవంతంగా జరగాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు, ఆర్డీవోసుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ కేశవరావు, డీఈ పాల్గొన్నారు.

# ఏపీవో సస్పెన్షన్

గద్వాల అర్బన్,ఏప్రిల్ 11 : మార్చిలో జరిగిన అడిట్ వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన ఏపీవో అనిల్‌కుమార్ సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాల మేరకు కేటీదొడ్డి మండల కేంద్రంలో ఉపాధి పథకంలో విధులు నిర్వర్తిస్తున్న ఏపీవో అనిల్ కుమార్ గతంలో ఇటిక్యాల మండలంలో ఏపీవోగా విధులు నిర్వర్తించే సమయంలో ఉపాధి పథకంలోని ఉద్యాన పథకంలో కొంత మేర అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగా గత మార్చిలో అధికారులు నిర్వహించిన ఆడిట్ వ్యవహారంలో అన్ని విషయాలు వెలుగులోకి రావడంతో డీఆర్డీవో నర్సింగరావు ఏపీవోను శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై ఎంపీడీవో కృష్ణమోహన్‌ను వివరణ కోర గా గతంలో ఇటిక్యాలలో విధులు నిర్వర్తించే సమయంలో అవకతవకలకు పాల్పడ్డారని తేలడంతో సస్పెండ్ చేశారన్నారు.

# పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

గద్వాల రూరల్, ఏప్రిల్ 11 : జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో వున్న 5 నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమాధికారి సరోజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వసతి గృహాల్లో మొత్తం 23మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి 5నెలలుగా వేతనాలు ఇవ్వ డం లేదన్నారు. కార్యక్రమంలో అనంద్ రాజు, జయాకర్, గోపాల్, అనిల్ పాల్గొన్నారు.

# రెండేసి ఉద్యోగాల్లో కానిస్టేబుల్ ఎంపిక



పరశురాం

వడ్డేపల్లి, ఏప్రిల్ 11 : కోచింగ్ లేకుండా గ్రూప్-1, గ్రూప్-2 జాబ్‌లు ఓ నిరుపేద పేదయువకుడు సాధించాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చిన్న గ్రామమైన పై పాడుకు చెందిన నిరుపేదలైన మంగళి రంగన్న, మహేశ్వరమ్మలకు ఒకే కుమారుడు పరశురాం. అత ను పుట్టగానే తండ్రి మరణించాడు. తల్లికూలీనాలి చేసి చదివించింది. గ్రామంలోని ప్రభుత్వ బడిలో పదోతరగతి చదివిన పరశురాం శాంతినగర్‌లో కటింగ్ షాపులో పనికి కుదిరాడు. పనిచేస్తూనే ప్రైవేటుగా ఇంటర్ చదివి కానిస్టేబుల్ సెలక్షన్‌లో ఏడేండ్ల కిందట ఉద్యోగం సా ధించాడు. అయినా అతను లక్ష్యం వీడలేదు ఎలాగైన గెజిటెడ్ ఉద్యోగం సాధించాలనే తపనతో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే గ్రూప్-1లో858ర్యాంకు 441 మార్కులు సాధించి ఎంపికయ్యాడు. అలాగే గ్రూప్-2లో 367 మార్కులు, 574వ ర్యాంకు వచ్చింది. పరశురాంను మండలంలో పలువులు నాయకులు, కుల సంఘాల వారు అభినందనలతో సన్మానించారు.

## హామీలను అమలు చేస్తాం

అమరచింత, ఏప్రిల్ 11 : రాష్ట్రంలో అర్థిక ఇబ్బందులున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాస్తా అలస్యమైన కచ్చితంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో, అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూర్ గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలతోపాటు సన్నబియ్యం పథకం, అలాగే పాంరెడ్డిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నాగల్‌కడ్మూర్ రైతు తిరుపతయ్య రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుచ్చారు. ఏవో అరవింద్‌ను పిలిచి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్లు షేక్‌చాంద్‌పాషా, రవి కుమార్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ALI BAHYAL S/o MOHAMMAD ABDUL KHADAR, R/o H.No.12-134/1D, Vidyanagar, Kalwakurthy, Nagar kurnool Dist., have changed my name ALI MIYA S/o MOHAMMAD ABDUL KHADAR, date of birth 12-04-1960 vide affidavit date 07-04-2025 before Shankaraiah Advocate and Notary, Kalwakurhty.

NT-MBNR


ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748



వనపర్తి కలెక్టరేట్‌లో జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి



గద్వాలలో కృష్ణవేణి చౌక్,కలెక్టరేట్‌లో పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

# బడుగుల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే

- ఊరూరా విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- జోగులాంబ గద్వాల, వనపర్తి కలెక్టరేట్ కార్యాలయాల్లో నివాళులర్పించిన కలెక్టర్లు సంతోష్, ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్/గద్వాల/ అలంపూర్/అయిజ /వడ్డేపల్లి/పెబ్బేరు/ గోపాల్‌పేట/ మల్దకల్/ రాజోళి/అలంపూర్‌చౌరస్తా/ అమరచింత/ గట్టు /ఖిల్లాఘణపురం/కొత్తకోట, ఏప్రిల్ 11 :వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి , అదనపు కలెక్టర్ రెవిన్యూ జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్,అదనపు ఎస్పీ వీరారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శంకర్‌గంజ్‌లో సతీశ్‌కుమార్ యాదవ్, ఉద్యోగ ప్రజా సంఘాలు, సాహితీకళా వేదిక ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వేడుకలను నిర్వహించారు. గద్వాలలో కలెక్టర్ సంతోష్ కృష్ణవేణిచౌక్ వద్ద పూలే ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ,నర్సింగరావు పాల్గొన్నారు. బీఆర్ఎస్,బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కృష్ణవేణి చౌరస్తాలో ఆయన విగ్రహానికి నియోజక వర్గ నాయకుడు బాసుహనుమంతు నాయుడు, బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కురువపల్లయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీచుపల్లి, మక్బూల్, రాజు, శ్రీరాములు, తిరుమలేశ్, మైర్య, కామేశ్, మాజ్, చిన్న,అంజి,జగన్,వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.ఎంఏఎల్‌డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరితా, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి పూలే విగ్రహానికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. అలంపూర్‌లో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. అయిజలో ఎంఈవో రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. వడ్డేపల్లి మండలంలోని పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాంతినగర్‌లోని డిగ్రీ కళాశాలలో జయంతి వేడుకలు జరిగాయి. పెబ్బేరు మండలంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గోపాల్‌పేట మండలంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు పాల్గొన్నారు. మల్దకల్ మండలంలో పూలే జయంతిని నిర్వహించారు. రాజోళి మండలంలో పూలే జయంతిని ఘనంగా జరిగింది. అలంపూర్‌మండలంలో పూలే జయంతి నిర్వహించారు. గట్టు మండలంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అమరచింత బస్టాండ్ కూడల్లో, ఆత్మకూర్ మండలంలోని పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఖిల్లాఘణపురం మండలంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ తదితరులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కొత్తకోట మండలంలో పలు పార్టీల నాయకులు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్ గౌడ్ పాల్గొన్నారు.



వనపర్తి ఎస్పీ కార్యాలయంలో జ్యోతిబా పూలేకు నివాళులర్పిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్



గద్వాలలో పూలే విగ్రహం దగ్గర నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు హనుమంతునాయుడు



గద్వాలలో పూలేకు నివాళులర్పిస్తున్న ఎంఏఎల్‌డీ కళాశాల అధ్యాపకులు





కొత్తకోట చౌరస్తాలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన వివిధ పార్టీల నాయకులు



వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిబా పూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

# సామాన్యుల నడ్డివిరుస్తున్న బీజేపీ

- బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వపల్లయ్య



మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

అయిజ, ఏప్రిల్ 11 : కేంద్రంలోని బీజేపీ సర్కారు వం టగ్యాస్ ధరలను అమాంతం పెంచి సామాన్యుల నడ్డివిరుస్తుందని బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వపల్లయ్య మం డిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో వి లేకర్లతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలపై రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ నోరుమెదపక పోవడం చూస్తుంటే కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. అంతర్జాతీయంగా క్రూడయిల్ ధరలు తగ్గినా కేంద్ర బీజేపీ సర్కార్ సామాన్య పేదప్రజలను మళ్లీ కట్టెల పొయ్యికి అంకితం చేసేందుకు ధరలను పెంచుతుందని విమర్శించారు. ధరల పెంపు తో వస్తున్న ఆదాయాన్ని ఆర్థిక దోపిడికి బీజేపీ ప్రభుత్వం పాల్పడుతుందని ఆరోపించారు. సెస్సులరూపంలో వస్తున్న ఆదాయాన్ని రాష్ర్టాలకు అందకుండా రాష్ర్టాల హక్కులను కబలిస్తోందన్నారు. పెంచిన సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో తులసిగౌడ్, మహేశ్, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నరసింహులు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 11 : గద్వాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కావలి నర్సింహులు ఎన్నికయ్యారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఈ క్రమంలో అధ్యక్షుడిగా నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా ఎండీ ఖాజా మొహినుద్దీన్, ప్రధానకార్యదర్శి జయసింహరెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరిగా రామకృష్ణలను సభ్యులు ఎన్నుకున్నారు. వీరి ఎన్నికపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నర్సింహులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోనే న్యాయస్థానం ఉండాలన్న నినాదమే గెలిపించిందన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

వడ్డేపల్లి, ఏప్రిల్ 10 : శాంతినగర్‌లో శనివారం విద్యుత్‌తీగలకు జంగిల్ కటింగ్ వున్నందున పట్టణంలో మాత్రమే ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని ఏడీ నవీన్‌కుమార్, ఏఈ చిన్న సుబ్బరాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలు సమాయత్తం కావాలి



పెబ్బేరులో బీఆర్ఎస్ కార్యకర్తలతో నాయకులు

పెబ్బేరు, ఏప్రిల్ 11 : వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి కార్యకర్త సమాయత్తం కావాలని పెబ్బేరు మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాములు, దిలీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాయకులతో కలిసి కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లయిన సందర్భంగా ఈ నెల 27న జరిగే సభకు ప్రతిఇంటి నుంచి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కర్రెస్వామి, వెంకటేశ్, రాజశేఖర్, సాయినాథ్ పాల్గొన్నారు.

## పోషకాహారం తీసుకోవాలి

పాన్‌గల్, ఏప్రిల్ 11 : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షైనీ అన్నారు. శుక్రవారం మండలంలోని గోప్లాపూర్ అంగన్వాడీ సెంటర్-1లో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాలతో బిడ్డలకు ఆరోగ్యం లభిస్తుందని, తల్లులు సరైనా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అలివేల, ఆశా కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ అందజేత

గోపాల్‌పేట, ఏప్రిల్ 11 : మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన కావలి లీలయ్య 2025 ఫిబ్రవరిలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్ గుర్తించారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి బాధితుడికి అందజేశారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

పాన్‌గల్, ఏప్రిల్11 : మండలంలోని శాగాపూర్ గ్రామంలో బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ డైరెక్టర్ చిన్న బాలరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు పేదలకు వరంగా మారాయని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన ఇద్దరి బాధితులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద బాలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గురుకులకు ఎంపికైన విద్యార్థినులు

కొత్తకోట, ఏప్రిల్ 11 : మండలంలోని రామనంతపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థినులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారని ఉపాధ్యాయుడు శేఖర్‌గౌడ్ తెలిపారు. వీరిలో ముగ్గురు విద్యార్థినులు కొత్తకోట, ఒకరు వనపర్తి గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్‌గౌడ్, సమీనా బేగం, గ్రామస్తులు విద్యార్థినులను అభినందించారు.

# జూరాల ఎడమ కాలువ గేట్లు బంద్

అమరచింత, ఏప్రిల్ 11 : మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడుమ కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేస్తే గేట్లను శుక్రవారం అధికారుల ఆదేశాల మేరకు గేట్లను బంద్ చేశారు. ఇప్పటికే జూరాల ప్రాజెక్టులో నీట్టిమట్టం పూర్తిగా తగ్గిపోయి కుడి, ఎడమ కాల్వలకు వచ్చే దారి ఎండిపోవడంతో సాగునీరు విడుదలయ్యే కుడి, ఎడుమ కాల్వల గేట్లను అధికారుల ఆదేశాల మేరకు బంద్ చేశారు. కాగా ఏప్రిల్ చివరి మాసం వరకు కాలువ ద్వారా సాగునీరు విడుదల చేస్తేనే తమ పంటలు చేతికి వస్తాయని రైతులు తెలుపుతున్నారు.

ఆత్మకూర్, అమరచింత మండలాల్లోని వి విధ గ్రామాల ప్రజలు నిత్యం అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తూ వారబందీ ద్వారా వచ్చే సాగునీటి కోసం పొలాల వద్ద రాత్రి, పగలు కాపాల కాసే వారు ఇంక ఇప్పుడు పూర్తిగా సాగునీటి కాల్వల గేట్లను బంద్ చేస్తే చేతికి వచ్చిన తమ పంటల పరిస్థితి ఏమిటని రైతులు వాపోతున్నారు. అప్పులు చేసి పెట్టుపడులు పెట్టి పంటను సాగుచేస్తే తీర చేతిక వచ్చిన పంట ఇప్పుడు సాగునీరు లేక తాలుగా మిగిలిపోతుందని రైతులు ఆందోళన పడుతున్నారు.

# మెరుగైన సేవలు అందించేందుకు కృషి

- సీటీ స్కాన్‌ను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే



సీటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గద్వాల టౌన్, ఏప్రిల్ 11 : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ సంతోష్ అన్నారు. జిల్లా జనరల్ దవాఖానలో రేడియాలజిలో ఏర్పాటు చేసిన సీటీస్కాన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన రోగనిర్ధారణ సేవలందించేందుకు అత్యాధునిక కంప్యూటరైజ్డ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో సీటీస్కాన్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని ఇక ఆ ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, సూపరింటెండెంట్ ఇందిర, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణులు ఆరోగ్యంగా ఉండేలా చూడాలి

గద్వాల, ఏప్రిల్ 11 : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నిర్మూలించి వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేవిధంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోషణ్ పక్వాడా ఏప్రిల్ 8 నుంచి 22వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చిన్నపిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలలో బలహీనంగా, పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆరోగ్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోషణ పక్షంలోని థీమ్స్ గురించి పీపీటీ ద్వారా వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, సంక్షేమశాఖాధికారి సునంద, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

గట్టు, ఏప్రిల్ 11 : రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని పీఏసీసీఎస్ చైర్మన్ క్యామ వెంకటేశ్ కోరారు. స్థానిక పీఏసీసీఎస్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం లోపు తేమ ఉండేటట్లు ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హనుమంతురెడ్డి, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న పీఏసీసీఎస్ చైర్మన్

## వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖిల్లాఘణపురం,ఏప్రిల్ 11 : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావ్, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పెద్దమందడిలో..

పెద్దమందడి, ఏప్రిల్ 11 : గ్రామాల్లో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సింగిల్‌విండో సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పామిరెడ్డిపల్లి, జగత్‌పల్లి గ్రామాలలో వనపర్తి మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్, సీఈవో జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మన్యపురెడ్డి, మాజీ సర్పంచు సిద్దయ్య, మాజీ ఎంపీటీసీ ఇంద్రమ్మ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

అలంపూర్, ఏప్రిల్ 11 : మండలంలోని ర్యాలంపాడు గ్రామంలో ఐకేపీ గ్రామ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2,300 నిర్ణయించారని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ రజియాబేగం తెలిపారు. వరి కొనుగోలు కేంద్రంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు భూలక్ష్మీ, రజియాబేగం, కార్యదర్శి దేవకర్ణ, ఫర్జానాబేగం, శంకర్‌గౌడ్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.